గ్రూప్ -4లో భారీగా బ్యాక్‌లాగ్

- ఈ ఉద్యోగాలు పొందిన వారిలో ఇతర ఉద్యోగులు
- టీచర్‌గా ఎంపికైన అభ్యర్థికి గ్రూప్-4 ఉద్యోగం
- నాట్ విల్లింగ్ ఆప్షన్ ఇవ్వకపోవడంతో ఎఫెక్ట్
- రెండు వేల పోస్టులు బ్యాక్‌లాగ్ అవుతాయంటున్న అభ్యర్థులు

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): గ్రూప్-4లో భారీగా పోస్టులు బ్యాక్‌లాగ్ అయ్యే అవకాశాలున్నాయి. 2వేలకు పైగా ఉద్యోగాలు భర్తీకాకుండా మిగలనున్నాయి. ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో ఈ పోస్టులు మళ్లీ బ్యాక్‌లాగ్ అవుతాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రూప్-4 ఫలితాలను గురువారం విడుదల చేశారు. 8,180 పోస్టులకు 8,084 పోస్టుల ఫలితాలు విడుదల చేశారు. అయితే ఉద్యోగాలు పొందిన వారిలో చాలా మంది ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారున్నారు. కొందరు టీచర్లుండగా, మరికొందరు కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. వీరంతా మంచి శాఖల్లో, మంచి పోస్టు వస్తే గ్రూప్-4 ఉద్యోగంలో చేరాలన్న ఆశతో గ్రూప్-4కు రాశారు. అయితే చాలా మందికి మంచి పోస్టులు దక్కలేదు. దీంతో వారంతా ఆయా పోస్టులను వదులుకోనున్నారు. తుది ఫలితాలకు ముందు ఆన్‌విల్లింగ్(ఉద్యోగం ఇష్టంలేదని) ఆప్షన్ తీసుకుంటే ఈ పోస్టులు బ్యాక్‌లాగ్ అయ్యేవికావని, నిరుద్యోగులకు నష్టం జరిగేది కాదని అభ్యర్థులంటున్నారు.

- వరంగల్ జిల్లాకు చెందిన ఓ అభ్యర్థి ఇప్పటికే టీచర్‌గా పనిచేస్తున్నాడు. తాజాగా గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికయ్యాడు. టీచర్ ఉద్యోగమే ఉన్నత స్థాయి ఉద్యోగం కావడంతో ఇప్పుడా అభ్యర్థి గ్రూప్-4 ఉద్యోగాన్ని వదులుకోనున్నాడు. ఎంపికకు ముందే ఆన్ విల్లింగ్ ఆప్షన్ ఇస్తే మరో అభ్యర్థికి ఉద్యోగం దక్కే అవకాశముండేది.
- కరీంనగర్ జిల్లాలో మరో అభ్యర్థి పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం దక్కగా అప్పటి ఉద్యోగం చేయాలన్న తలంపుతో ఉన్నాడు. దీంతో జూనియర్ అసిస్టెంట్ పోస్టు బ్యాక్‌లాగ్‌కానుంది.
- కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న వారు సైతం గ్రూప్-4 ఉద్యోగాలు పొందారు. హోదా, దర్పం, పదోన్నతి పరంగా కానిస్టేబుల్‌గా ఉండేందుకు కొంత మంది ఇష్టపడుతున్నారు.

మళ్లీ వచ్చేదెప్పుడో..

ఇప్పుడు బ్యాక్‌లాగ్ అయిన పోస్టులను మళ్లీ భర్తీచేసే అవకాశాలు కనిపించడం లేదు. సమీప భవిష్యత్తులో గ్రూప్-4 నోటిఫికేషన్ వచ్చే పరిస్థితులు లేవు. కాంగ్రెస్ ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో గ్రూప్-4 ప్రస్తావనే లేదు. గ్రూప్-4ను రద్దు చేసి, ఆయా పోస్టులను గ్రూప్-3లో విలీనం చేస్తారనే ప్రచారం ఉంది. ఇది వరకు పోస్టుల భర్తీ లో రీలింక్విష్‌మెంట్ అవకాశం కల్పించారు. కానీ అకస్మాత్తుగా రీలింక్విష్‌మెంట్ ఆప్షన్‌ను ప్రభుత్వం తొలగించినట్టు అభ్యర్థులు వాపోతున్నారు. అటు ఆన్ విల్లింగ్ ఆప్షన్ ఇవ్వకపోవడం, ఇటు రీలింక్విష్‌మెంట్ ఆప్షన్‌ను తొలగించడంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. ఆన్ విల్లింగ్ ఆప్షన్ ఇచ్చి ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

మూడేండ్ల డిగ్రీ ఇక రెండున్నరేండ్లే

- వచ్చే ఏడాది నుంచి అమలు
- వెల్లడించిన యూజీసీ చైర్మన్

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ కోర్సులను కావాలనుకుంటే వేగంగా పూర్తిచేసుకోవచ్చు. మూడేండ్ల డిగ్రీ కోర్సును రెండున్నరేండ్లల్లో.. నాలుగేండ్ల డిగ్రీ కోర్సును కేవలం మూడేండ్లల్లో పూర్తిచేసుకోవచ్చు. ఇలాంటి అవకాశాన్ని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) కల్పించనున్నది. వచ్చే ఏడాది నుంచి ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్ తెలిపారు. అత్యంత ప్రతిభావంతులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుందని వెల్లడించారు. కోర్సుల వ్యవధి తగ్గించే అంశంపై యూజీసీ నిపుణుల కమిటీ కొత్త సిఫారసులను యూజీసీకి సమర్పించగా, ఇటీవలే ఆమోదం తెలిపింది. ఈ విధానానికి సంబంధించిన మార్గదర్శకాలను సోమవారం విడుదల చేయనున్నట్టు జగదీశ్‌కుమార్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. నెమ్మదస్తుల కోసం ఆలస్యంగా కోర్సులను పూర్తిచేసుకునే వెలుసుబాటును ఇప్పటికే కల్పించామని పేర్కొన్నారు.

పదేండ్లల్లో విద్యుత్తు డిమాండ్ రెట్టింపు

- ఏటా ఆరు శాతానికి పైగా పెరగనున్న వినియోగం
- సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నివేదికలో వెల్లడి
- తగిన ఏర్పాట్లు చేయాలని ఇంధనశాఖకు సూచన



భవిష్యత్తు అంచనాలు

సంవత్సరం	డిమాండ్ మిలియన్ యూనిట్లలో (పెరుగుదల శాతం)	పీక్ డిమాండ్ మెగావాట్లలో (పెరుగుదల శాతం)
2025-26	96,596 (7.51)	18,138 (6.41)
2026-27	1,02,732 (7.46)	19,529 (6.53)
2027-28	1,08,932 (7.31)	20,968 (6.38)
2028-29	1,15,347 (7.23)	22,488 (6.32)
2029-30	1,22,627 (8.05)	24,215 (6.85)
2030-31	1,28,032 (5.43)	25,639 (4.58)
2031-32	1,33,211 (5.38)	27,059 (4.82)
2032-33	1,38,600 (5.38)	28,558 (4.82)
2033-34	1,44,206 (5.38)	30,139 (4.82)
2034-35	1,50,040 (5.38)	31,809 (4.82)

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాబోయే పదేండ్లలో విద్యుత్తు అవసరాలు రెట్టింపుకానున్నాయి. ప్రస్తుతమున్న విద్యుత్తు డిమాండ్ 2035 కల్లా డబుల్ కానుంది. 2035 నాటికి రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ 1.5 లక్షల మిలియన్ యూనిట్లకు చేరుకోగలదని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అంచనా వేసింది. ఇక పీక్ డిమాండ్ రోజుకు 31వేల మెగావాట్ల వరకు చేరగలదని సీఈఏ హెచ్చరించింది. ఇటీవలే రిపోర్ట్ ఆన్ రిసోర్స్ అడిక్వెసీ ప్లాన్ ఫర్ తెలంగాణ-2034-35 నివేదికను సీఈఏ విడుదల చేసింది. రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ ఏటా ఆరు శాతానికి పైగా పెరుగనుందని వెల్లడించింది. 2023 -24లో రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ 84,623 మిలియన్ యూనిట్లుగా ఉండగా, పీక్ డిమాండ్ 15,623 మెగావాట్లుగా నమోదైంది. ఇది 2034- 35 నాటికి రెట్టింపుకానుంది. రాష్ట్రంలో విద్యుత్తు అవసరాలు రానురాను పెరుగుతాయని, ఆ మేరకు సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించింది. డిమాండ్‌కు తగిన రీతిలో విద్యుత్తు ఉత్పత్తిని రెట్టింపు చేయాలని తెలిపింది.

52 శాతం థర్మల్ విద్యుత్తే

రాష్ట్రంలో 52 శాతం విద్యుత్తు థర్మల్ ప్లాంట్లలోనే ఉత్పత్తి అవుతున్నది. రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 18,958 మెగావాట్లు కాగా, 9,791 మెగావాట్లు థర్మల్‌ప్లాంట్లల్లోనే ఉత్పత్తి అవుతున్నది. ఆ తర్వాత సౌర విద్యుత్తు రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో సోలార్ విద్యుత్తు వాటా 2,518 (26 శాతం) మెగావాట్లుగా ఉంది. జలవిద్యుత్తు 2,518 మెగావాట్లు (13 శాతం)గా ఉంది. థర్మల్ ప్లాంట్ల లోడ్ ఫ్యాక్టర్ 2028 -29లో 51-59శాతం ఉంటుందని సీఈఏ అంచనా వేసింది. ఇది క్రమేపీ 50 శాతానికి చేరుతుందని వెల్లడించింది. రాష్ట్రంలో ఫిబ్రవరి - మార్చి మాసాల్లో పీక్ డిమాండ్ ఉంటుందని, రాత్రితో పోల్చితే పగటిపూటే డిమాండ్ అధికంగా ఉంటున్నదని సీఈఏ తెలిపింది. భవిష్యత్తు డిమాండ్ నేపథ్యంలో రాష్ట్రంలో స్థాపిత విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా పెంచాలని సీఈఏ సూచించింది. ముఖ్యంగా సౌర, పవన (విండ్) విద్యుత్తు, బ్యాటరీ స్టోరేజీ విద్యుత్తు ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని సూచించింది.

పనులు చేయలేం

- ఇరిగేషన్ శాఖకు కాంట్రాక్టర్ల మొర
- ప్రీక్లోజర్‌కు దరఖాస్తులు
- డబ్బులు విడుదల చేస్తేనే పనులు కొనసాగిస్తామని మరికొందరి అల్టిమేటం

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించడం లేదు. రివైజ్డ్ ఎస్టిమేషన్లను ఆమోదించడం లేదు. ఇలాగయితే ప్రాజెక్టు పనులను ఇక చేయలేం అంటూ ఇరిగేషన్‌శాఖలోని కాంట్రాక్టర్లు చేతులు ఎత్తేస్తున్నారు. బ్యాంకు గ్యారంటీలను విడుదల చేయాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నారు. పదుల సంఖ్యలో కాంట్రాక్టర్లు ఇదే విషయాన్ని తేల్చిచెప్పేస్తున్నారు. ఇప్పటికే పలు ఏజెన్సీలు ప్రీక్లోజర్ కోసం ఇరిగేషన్‌శాఖకు దరఖాస్తు పెట్టుకున్నాయి. సాధారణంగా ఏదయిన పనికి సంబంధించి ఏజెన్సీతో ఇరిగేషన్ శాఖ అగ్రిమెంట్ చేసుకుంటుంది. పనులను చేసిన కొద్దీ ఎంబీ రికార్డులు చేసి ఆ మేరకు బిల్లులను చెల్లిస్తుంది. ఒప్పందం గడువు ముగిసినా పనులు ఇంకా మిగిలి ఉన్నట్లయితే అగ్రిమెంట్‌ను ఎక్స్‌టెన్షన్ చేస్తూ పోతుంటుంది. 10నెలలుగా ఇరిగేషన్‌శాఖలోని బడాబడా ఏజెన్సీలకు మినహా చిన్నా చితక ఏజెన్సీలకు 10నెలలుగా రూపాయి కూడా విడుదల చేయని పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. చేసిన పనులకు బిల్లులు రాక, మిగిలిపోయిన పనులను చేయలేక సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే పనులను వదులుకునేందుకు సిద్ధమవుతున్నారు. మిగిలిన పోయిన పనులను చేయలేమంటూ, ప్రీక్లోజర్‌కు అనుమతివ్వాలంటూ ఇరిగేషన్‌శాఖకు మొరపెట్టుకుంటున్నారు. ఇప్పటికే జవహర్‌నెట్టింపాడు, ఎమ్మార్పీతోపాటు, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగస్వామ్యమైన పలు పనులను సొంతంగా, ఇతర ఏజెన్సీలతో కలిసి జాయింట్ వెంచర్‌గా చేస్తున్న సంస్థలు సైతం ప్రీక్లోజర్‌కు మొగ్గుచూపడం గమనార్హం. ఇప్పటికే అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టామని, సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో వడ్డీలు తడిసిమోపెడవుతున్నాయని ఏజెన్సీలు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తమ పరిధిలోని ప్రాజెక్టుల్లో మిగిలిన పనులను చేయలేమంటూ చేతులు ఎత్తేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటివరకు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను సత్వరమే చెల్లించాలని, అప్పుడే తమ పరిధజలో మిగిలిన పనులను పూర్తిచేస్తామంటూ పలు ఏజెన్సీలు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేస్తున్నాయి. ఇప్పటికే ఆయా ప్రాజెక్టుల సీఈలకు తేల్చిచెప్పారు. ప్రీక్లోజర్‌కు దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.



బ్యాంకు గ్యారంటీలను ఇవ్వండి..

బిల్లుల సంగతేమోకానీ బ్యాంకు గ్యారంటీలనైనా విడుదల చేయాలని పలు ఏజెన్సీలు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నాయంటే బిల్లుల చెల్లింపు ఏ తీరుగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. వాస్తవంగా ప్రాజెక్టు పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ, ఒప్పందం క్రమంలో ఇరిగేషన్ శాఖ సదరు ఏజెన్సీల నుంచి ఈఎండీ (ఎర్నెస్ట్ మ్యాన్ డిపాజిట్), ఎఫ్ఎస్‌డీ (ఫర్‌దర్ సెక్యూరిటీ డిపాజిట్)లను సేకరిస్తున్నది. మొత్తం ప్రాజెక్టు విలువలో ఇది దాదాపు 5శాతం మేరకు ఉంటుంది. ఒప్పందం మేరకు పనులన్నీ పూర్తయ్యాయని నిర్ధారించుకున్నాక తరువాత ఈఎండీ, ఎఫ్ఎస్‌డీలను విడుదల చేస్తాయి. ఏజెన్సీలు ఒప్పందం మేరకు పనులను పూర్తిచేయనట్లయితే ఈ డిపాజిట్ల నుంచి ఆ మేరకు సొమ్మును ఇరిగేషన్‌శాఖ మినహాయించుకుంటుంది. ఇదిలా ఉంటే ఇరిగేషన్‌శాఖలోని అనేక ఏజెన్సీలు ఇప్పుడు బిల్లుల సంగతి అటుంచితే ప్రస్తుతం ఈ డిపాజిట్లు, బ్యాంకు గ్యారంటీలనైనా విడుదల చేయాలని ప్రభుత్వానికి మొరపెట్టుకున్నాయి. పనులను చేయలేమని తేల్చిచెబుతున్నాయి. ఇప్పటికే తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. ప్రభుత్వం మాత్రం ఇప్పటికే బిల్లులను చెల్లించని పరిస్థితి నెలకొన్నది. ఇదిలా ఉంటే ప్రీక్లోజర్, బ్యాంకు గ్యారంటీల తిరిగి చెల్లింపు కోసం కాంట్రాక్టర్లు పెట్టుకుంటున్న విజ్ఞప్తులన్నింటినీ ఇరిగేషన్‌శాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి విన్నవించారు. ఏజెన్సీలతో చర్చలు కొనసాగిస్తున్నాయి. త్వరలోనే దీనిపై ప్రత్యేక సమావేశం నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం.

టీఎస్‌పీఈఏ అధ్యక్షుడిగా పీ రత్నాకర్‌రావు

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్(టీఎస్‌పీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా పీ రత్నాకర్‌రావు తిరిగి ఎన్నికయ్యారు. 2024 నుంచి 2027 వరకు అధ్యక్షుడిగా కొనసాగుతారు. అసోసియేషన్‌తోపాటు, విద్యుత్తు సంస్థల కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సదానందం, అసోసియేట్ అధ్యక్షుడిగా జేఎల్ జనప్రియ, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎం వెంకటేశ్వర్లును ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి కే సమ్మయ్య ప్రకటించారు. సెక్రటరీగా వీ గోపాల్‌రావు, కిరణ్‌కుమార్, కిషోర్‌కుమార్, సీహెచ్ విద్యాసాగర్, సురేశ్‌బాబు, తిరుపతి, బుచ్చయ్య, ఆర్ రాజ్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

రేపు, ఎల్లుండి గ్రూప్-3 పరీక్షలు

- రాష్ట్ర వ్యాప్తంగా 1,401 కేంద్రాలు
- హాజరుకానున్న 5.36లక్షల అభ్యర్థులు

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ శాఖల్లోని పలు ఉద్యోగాల భర్తీకి నిర్వహించే గ్రూప్-3 పరీక్షలు ఆది, సోమవారాల్లో జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5.36 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానుండగా, 1,401 కేంద్రాలను ఏర్పాటు చేసింది. పరీక్షల పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు అప్పగించారు. మొత్తం మూడు పేపర్లు ఉండగా మూడు సెషన్లలో పరీక్ష జరగనున్నది. ఆదివారం ఉదయం జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్, మధ్యాహ్నం హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ, సోమవారం ఉదయం ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్షను నిర్వహిస్తారు.

'టీచర్లను రెగ్యులరైజ్ చేయండి' : తపస్

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): కేజీబీవీల్లో పని చేస్తున్న టీచర్లను రెగ్యులరైజ్ చేసి, మినిమం టైమ్ స్కేల్ అమలు చేసేలా ఆదేశాలివ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్‌ను తపస్ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని, ఈ అంశంపై స్పష్టతనిస్తూ రాష్ట్రాలకు తగు ఆదేశాలివ్వాలని కోరింది. రాష్ట్రంలో గెజిటెడ్ హెచ్ఎం స్థాయి వరకే పదోన్నతులిస్తున్నారని, డిప్యూటీ ఈవో, ఎంఈవో, డైట్ లెక్చరర్ల పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ న్యాయ చిక్కులను తొలగించేందుకు సహకరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతరావు, నవాత్ సురేశ్, ఏబీఆర్ఎస్ఎం ప్రతినిధి సూరం విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సహ అధ్యక్షురాలు బెండి ఉష, పెంటయ్య, కోట్ల కాశీరావు, కవిత, సాయిబిందు తదితరులు ఉన్నారు.

సాంబారులో పడి చిన్నారి మృతి

వడ్డేపల్లి, నవంబర్ 15 : వేడి వేడి సాంబారులో పడి చిన్నారి మృతి చెందిన ఘటన శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లాలో విషాదాన్ని నింపింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామానికి చెందిన వారు ఏపీలోని కోడుమూరు సమీపంలోని యంగోడులో పెండ్లి ఖాయం చేసుకునేందుకు వెళ్లారు. కాగా, యంగోడులో అతిథుల కోసం వండిన వంటకాల వద్దకు పైపాడుకు చెందిన వీరేశ్, లక్ష్మి కుమారుడు జగదీశ్ (5) వెళ్లాడు. జగదీశ్ సాంబారు గిన్నెపై కూర్చోగా మూత తొలకడంతో బాలుడు వేడి వేడి సాంబారులో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని బయటకు తీసేలోగా మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

తిప్పేశ్వర్ టు తెలంగాణ

- కవ్వాల్ అభయారణ్యంలో పెద్ద పులుల సంచారం
- భయం గుప్పిట ఉమ్మడి ఆదిలాబాద్ ప్రజలు

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తేతెలంగాణ): పెద్దపులుల సంచారంతో ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ నుంచి రెండు పెద్దపులులు కవ్వాల్ అభయారణ్యంలోకి ప్రవేశించాయి. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు తెలిపారు. తాజాగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో పెద్దపులి సంచారం కలకలం రేపుతున్నది. అడవిలో ఠీవిగా నడుస్తున్న పెద్దపులి వీడియో వైరల్ అవుతున్నది. నాలుగు రోజుల క్రితం నిర్మల్ జిల్లా పెంబి మండలం బుర్కరేగిడిలో పెద్దపులి.. ఎద్దుపై దాడి చేసి చంపేసింది. అంతకుముందు సారంగపూర్ మండలం మహబూబ్‌ఘాట్ వద్ద స్థానికులకు చిరుత కనిపించింది. ఒకవైపు చిరుతలు, మరోవైపు పెద్దపులులు పశువులపై దాడి చేస్తూ ప్రజలను కలవరపెడుతున్నాయి. వారం క్రితం తిప్పేశ్వర్ నుంచి వచ్చిన పులి మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో మూడు ఆవులను, హాజీపూర్ మండలంలో రెండు గొర్రెలను చంపేసింది. మరోవైపు పులులు, చిరుతల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు కవ్వాల్ డీఎఫ్‌వో వెల్లడించారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

- గిరాకీ లేక మనోవేదన
- కుటుంబం గడవక ఆందోళన
- మహబూబాబాద్‌లో ఘటన

జనార్దన్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 15 : ఉపాధి కరువై.. కుటుంబం గడవక మనోవేదనకు గురైన ఓ ఆటో డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో శుక్రవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం కొరుకొండపల్లికి చెందిన తుమ్మ జనార్దన్ (36) పదేండ్లుగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వీరికి ఎలాంటి భూమి లేదు. ఇతని భార్య సైతం కూలీ పనులకు వెళ్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలకు గిరాకీ తగ్గింది. ఆర్థిక ఇబ్బందులు నెలకొన్న తరుణంలో కుటుంబ అవసరాలకు, పిల్లల చదువుకు అప్పు చేశాడు. ఆటో పాతది కావడంతో దాని స్థానంలో ఫైనాన్స్‌లో కొత్త ఆటో కోసం శుక్రవారం మహబూబాబాద్‌లోని షోరూంకు వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా గుండె నొప్పి రావడంతో జనార్దన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. జనార్దన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

చెన్నూర్‌లో చిన్నారి..

నివృతి (ఫైల్)

చెన్నూర్ టౌన్, నవంబర్ 15 : గుండెపోటుతో పన్నెండేళ్ల చిన్నారి ప్రాణాలు వదిలింది. ఈ విషాదకర ఘటన మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకున్నది. చెన్నూర్ పట్టణంలోని పద్మానగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్-రమా దంపతులకు కూతురు నివృత్తి(12), కొడుకు ఉన్నారు. నివృతి చెన్నూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నది. శుక్రవారం కార్తీక పౌర్ణమి కావడంతో పాఠశాలకు సెలవు ఇవ్వడంతో ఇంటి వద్దే ఉన్నది. ఉదయం ఇంట్లో ఆడుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. గుండెపోటుతో మృతి చెందినట్టు ప్రాథమికంగా గుర్తించారు.

పిల్లలమర్రి వినోద్ | పిల్లలమర్రి అరవింద్ | లైశెట్టి అఖిల్ | కమలాకర్ | బొడిగె వెంకటేశ్ | వెంకటేశ్ పటేల్

ఒకే గ్రామంలో నలుగురికి ఉద్యోగాలు

- గ్రూప్-4లో సత్తాచాటిన అన్నదమ్ములు
- నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో నోటిఫికేషన్, పరీక్ష
- వీణవంక మండలంలో ఒకరికి నాలుగు ఉద్యోగాలు

ధర్మారం/చొప్పదండి/వీణవంక, నవంబర్ 15 : గ్రూప్-4 ఉద్యోగాల్లో యువతీయువకులు సత్తాచాటారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్-4 నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించగా, తాజాగా ఫలితాలు వెల్లడయ్యాయి. ఇందులో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన నలుగురు యువకులు పిల్లలమర్రి వినోద్, పిల్లలమర్రి అరవింద్, లైశెట్టి అఖిల్, అలువాల కమలాకర్ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించారు. ఇందులో పిల్లలమర్రి వినోద్, పిల్లలమర్రి అరవింద్ అన్నదమ్ములు. తొలి ప్రయత్నంలోనే ఒకే గ్రామానికి చెందిన యువకులు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. దొంగతుర్తి గ్రామానికి చెందిన పిల్లలమర్రి కళావతి-తిరుపతి దంపతులు తమ ఇద్దరు కొడుకులైన వినోద్, అరవింద్‌ను కష్టపడి చదివించారు. వ్యవసాయం చేయడంతోపాటు పిండి గిర్ని నడుపుతూ కొడుకులను ప్రయోజకులను చేశారు. పెద్ద కొడుకు వినోద్ ఆరేళ్ల క్రితమే వరంగల్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేయగా, చిన్న కొడుకు 2023లో హైదరాబాద్‌లోని రామంతపూర్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్స్ పూర్తి చేసి గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యారు. వీళ్లిద్దరూ ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపిక కాగా, గ్రూప్-1లో ప్రిలిమినరీ అర్హత సాధించి గత నెలలో మెయిన్స్ రాశారు. ఇదే గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన లైశెట్టి అనిత- భిక్షపతి పెద్ద కొడుకు అఖిల్ తమిళనాడులోని చెన్నైలో ఎస్ఆర్ యూనివర్సిటీలో 5 నెలల క్రితం బీటెక్ పూర్తి చేసి, తొలి ప్రయత్నంలో గ్రూప్-4 (జూనియర్ అసిస్టెంట్) ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మరో వ్యవసాయ కుటుంబమైన అడువాల స్వరూప-తిరుపతి రెండో కొడుకు 2020లో హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసి, ఇంటివద్దనే ప్రిపేరై గ్రూప్-4 (జూనియర్ అసిస్టెంట్) ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బొడిగె వెంకటేశ్ గ్రూప్-4 ఫలితాల్లో 176 మార్కులు సాధించి జూనియర్ అసిస్టెంట్ జాబ్ కొట్టేశాడు. గ్రూప్-1 మెయిన్స్‌కూ ఎంపికయ్యాడు.

ఐలాబాద్ వాసికి నాలుగు ఉద్యోగాలు

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఐలాబాద్‌కు చెందిన పురంశెట్టి వెంకటేశ్ పటేల్ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గ్రూప్-4 ఫలితాల్లో సత్తాచాటడంతోపాటు గతంలో ఏఈఈ గెజిటెడ్ ఆఫీసర్, ఏఈ మున్సిపల్, ఎస్సెస్సీలో జూనియర్ ఇంజినీర్‌లో ఉద్యోగం సాధించాడు.

సర్కారు కొలువులాట!

మొదటిపేజీ తరువాయి...

సర్టిఫికెట్ల అంశం వెలుగులోకి వచ్చింది. బీకాం అభ్యర్థులకు ఎస్ఏ సోషల్‌స్టడీస్ పోస్టుకు అర్హతలపై అభ్యంతరాలు రాజుకున్నాయి. డీఎస్సీ భర్తీపై రోజుకో చోట రచ్చకు దారితీస్తున్నది. ఖమ్మం జిల్లాలో ఏడుగురు హిందీ పండిట్లకు టీచర్ ఉద్యోగమిచ్చి, 22 రోజుల తర్వాత ఉద్యోగం నుంచి తొలగించారు. అర్హత లేదనే సాకుతో వారిని టెర్మినేట్ చేశారు. తాజాగా వెలుగుచూసినవి కొన్ని మాత్రమేనని, ఇలాంటివి మరికొన్ని జరిగి ఉంటాయన్న ప్రచారం జోరుగా సాగుతున్నది. డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ప్రభుత్వం హవావిడిగా పూర్తి చేయడంతో ఈ పరిస్థితి నెలకొన్నదనే ఆరోపణలున్నా